ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిరుపయోగంగా స్మార్ట్ పోల్స్

◆ దిష్టి బొమ్మలుగా మారాయని విమర్శలు ◆ నగర వాసులకు అందని విపత్తులు, ట్రాఫిక్ సమాచారం

◆ నాడు 50 చోట్ల ఏర్పాటు ◆ ఒక్కోదానికీ రూ.30 లక్షల ఖర్చు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటుతో జివిఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ పోల్స్ నిరుపయోగంగా మారి దిష్టి బొమ్మలను తలపిస్తున్నాయి. ప్రకృతి విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ముందుగానే తెలియజేసి, వారిని అప్రమత్తం చేసేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు అప్పట్లో జివిఎంసి అధికారులు ప్రకటిం చారు. అంతేకాకుండా ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ వంటి సమాచారాన్ని కూడా వీటి ద్వారా తెలియజేస్తామని చెప్పారు. వాస్తవంలో అవేవీ జరగలేదు.

మహా నగరాల్లో నివసించే ప్రజలకు ప్రపంచ స్థాయి సదుపాయాలు, వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2015లో స్మార్ట్ సిటీ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. తొలి దశలో దేశ వ్యాప్తంగా 20 నగరాలను ఎంపిక చేయగా అందులో విశాఖకు చోటు దక్కింది. ఈ నేపథ్యంలో 2016లో విశాఖ నగర పరిధిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద పలు పనులు చేపట్టారు.



సెంట్రల్ పార్క్ ఫుడ్ కోర్ట్ వద్ద మొక్కల చాటున ఉన్న స్మార్ట్ పోల్

అందులో భాగంగా 50 చోట్ల స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్క దానికీ రూ.30 లక్షలు ఖర్చు చేశారు. మొత్తం రూ.15 కోట్లతో 50 పోల్స్ ఏర్పాటయ్యాయి. వీటన్నింటినీ జివిఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిటీ ఆపరేషన్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. స్మార్ట్ పోల్‌పై వైఫై సదుపాయం కూడా సమకూర్చారు. స్మార్ట్ పోల్‌కు 300 మీటర్ల పరిధిలో ఉచితంగా వైఫైను ప్రజలు వినియోగించుకోవచ్చని అప్పట్లో ప్రకటించారు. అలాగే తుపాను, భూకంపం వంటి విపత్తులు సంభవించినప్పుడు దానికి సంబంధిం చిన సమాచారాన్ని కూడా ప్రజలకు తెలియజెప్పడం కోసం ప్రతి స్మార్ట్ పోల్‌కు పబ్లిక్ అలర్ట్ సిస్టం అమర్చారు. వీటి ద్వారా ప్రజలను అప్రమత్తం చేయవచ్చని నాడు అధికారులు వివరించారు. స్మార్ట్ పోల్‌కు నాలుగు వైపులా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం అవి సిఐసిడి ఫుటేజీని పంపిస్తాయని, సిఐసి నుంచి ఆయా కెమెరాలను ఆపరేట్ చేస్తూ కావలసినవైపు తిప్పి, అవసరమైనంత జూమ్ చేసి దృశ్యాలను పరిశీలించే వీలుంటుందని కూడా అధికారులు చెప్పారు. నగర వాసులకు మిగతా 2లో..



రోగిని పరామర్శిస్తున్న కెజిహెచ్ సూపరింటెండెంట్ శివానంద

జిబిఎస్ రోగులకు మెరుగైన వైద్యం

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అరుదైన జిబిఎస్ (గులియన్ బారే సింద్రోమ్) వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు రోగులు కింగ్ జార్జ్ ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ వార్డులో చికిత్స పొందుతున్నారని, వారందరికీ ప్రత్యేకంగా వైద్యులను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య చికిత్స అందజేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. శనివారం ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్ఎంఒ డాక్టర్ మెహర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవిలతలతో కలిసి జిబిఎస్ రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. వైద్యం విషయంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆందోళన చెందొద్దు

జిబిఎస్ కలకలం వార్తల నేపథ్యంలో మీడియాతో శివానంద మాట్లాడుతూ జిబి సింద్రోమ్ గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆ వ్యాధి తీవ్రంగా ఉందనేది అబద్ధమని పేర్కొన్నారు. ఇది చాలా పురాతనమైన వ్యాధని తెలిపారు. ఆ వ్యాధితో కెజిహెచ్‌కు రోగులు వస్తే వారికి అవసరమైన మిగతా 2లో..

ఘనంగా కస్టమ్స్ డే వేడుకలు
▶ వార్త 2లో..

అవకాశమివ్వండి.. మీ గళం వినిపిస్తా..
▶ వార్త 5లో..

సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకం
▶ వార్త 2లో..

ఫేక్ అకౌంట్స్‌తో..

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫేక్ ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్స్ క్రియేట్ చేసి విశాఖ నగరానికి చెందిన యువతిని వేధిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నగరానికి చెందిన ఒక యువతికి గుర్తు తెలియని ఫేక్ ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ల నుంచి ఆమె ఫేస్‌తో అశ్లీలంగా మార్ఫ్ చేసిన ఫొటోస్ వచ్చాయని తెలిపారు. అలానే ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా న్యూడ్ వీడియో కాల్ చేయాలని, లేదంటే అశ్లీలంగా మార్ఫ్ చేసిన ఫొటోలను బాధితురాలి ఫాలోవర్స్ అందరికీ ఫార్వర్డ్ చేస్తామనే బెదిరింపు మెసేజ్‌లు వచ్చాయన్నారు. దీంతో బాధితురాలు భయానికి గురై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. విచారణలో నిందితుడు కంచరపాలెంకు చెందిన వ్యక్తిగా గుర్తించి, అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

జ్యోతికి ఆర్థిక సాయం చేయాలి

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ట్రాక్ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు శిక్షణ, ఇతర సౌకర్యాల కోసం దీర్ఘకాలిక ఆర్థిక సహాయం అందించాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన ఒక లేఖ రాశారు. ఆ వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. విశాఖకు చెందిన ప్రముఖ అథ్లెట్ జ్యోతి మిగతా 2లో..

కార్పొరేట్ హత్యలు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'విద్య ఒక వికాసం'.. కానీ అది కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రం విద్యార్థుల పాలిట విషాదమవుతోంది. నాలుగు రోజుల క్రితం విశాఖ నగర శివారు మధురవాడ వద్దనున్న నారాయణ కార్పొరేట్ కాలేజీలో జరిగిన ఘటన దీన్ని పట్టిచూపుతుంది. ఆ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒడిశాకు చెందిన 17 ఏళ్ల చంద్ర వంశీ కళాశాల ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సరిగా చదవడం లేదంటూ కొంతమంది లెక్చరర్లు ఆ విద్యార్థిని మందలించడమే కారణంగా తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు గతంలో నగరంలోని గాజువాక, మధురవాడ, పెందుర్తి సహా పలుచోట్ల చోటుచేసుకున్నాయి. తాజాగా మధురవాడ ఘటనపై విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ స్పందించి ఒత్తిడి పెంచే చదువులు తగవని పేర్కొంది. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందించాలని డిమాండ్ చేసింది. ఆ సంఘం నాయకులు తాజా ఘటనపై ఆందోళనకూ దిగారు. విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యాన్ని వదిలేసి న్యాయం కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులను



పోలీసులు అరెస్టు చేయడం విస్మయం గొలిపే అంశం.

అసలేం జరుగుతోంది ?

ఏదైనా ఒకటి ఇలాంటి ఘటన జరిగితే తర్వాత అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు అప్పటికప్పుడే కదిలి పరిస్థితిని సమీక్షించడం చేసి, ఆ తర్వాత వదిలేస్తున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నది వాస్తవం. ఫీజులే లక్ష్యంగా, విద్యార్థులపై చదువుల ఒత్తిడే క్రమశిక్షణగా కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా తమ అనైతిక విధానంతో చెలరేగిపోతున్నాయి. విశాఖలోని పిఎం.పాలెంలో ఇదే విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు గతంలో యాజమాన్య తీరుపై ఆందోళనలకు దిగారు. క్రమశిక్షణ పేరుతో కఠినంగా దండించడం కార్పొరేట్ యాజమాన్యాలకు అలవాటుగా మారి పోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై ఇలాంటి చిన్న చిన్న ఒత్తిడులే దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తున్నాయి. విద్యార్థుల పట్ల సముచిత దృష్టి, విద్య పట్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జిబిఎస్ రోగులకు మెరుగైన వైద్యం

మందులు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి ఖరీదైన మందులు అయినప్పటికీ ఉచితంగానే ఇస్తున్నామన్నారు. కొద్దిరోజుల క్రితం ఐదుగురు రోగులు వచ్చారని, వారిని ఇన్ పేషెంట్లుగా ఉంచి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళంలో ఈ వ్యాధి కలకలం రేపిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము అప్రమత్తమయ్యామన్నారు. డాక్టర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. జిబిఎస్ లక్షణాలను తెలియజేశారు. ఈ వ్యాధి బారిన పడితే బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయన్నారు. వివిధ రకాల వైరల్ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు సోకుతాయన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.

నిరుపయోగంగా స్మార్ట్ పోల్స్

ఏదైనా సమస్య ఎదురైనా లేదా ఆపదలో ఉన్నా స్మార్ట్ పోల్ వద్దకు వెళ్లి పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం బాక్స్ వద్ద నిలబడి మాట్లాడితే సిటిసికి చేరి, సిబ్బంది తక్షణ సహాయ చర్యలకు ఆదేశిస్తారని ప్రకటించారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో గాలి నాణ్యత ఏ స్థాయిలో ఉందనేది ఎప్పటికప్పుడు మైక్ ద్వారా ప్రకటిస్తారని, ఆ పరిధిలోని రోడ్లపై ట్రాఫిక్ పరిస్థితిని సిఐసికి చేరవేయడంతోపాటు మైక్‌లో చెబుతారని గొప్పగా చెప్పుకొచ్చారు. వీటిని ఏర్పాటు చేసిన తర్వాత నామమాత్రంగా మైక్ అనౌన్స్‌మెంట్, సిసి కెమెరాలు పనిచేశాయి తప్పితే వాటివల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ కలగలేదు. దీనికి ఉదాహరణగా 2020లో ఎల్‌జి పాలిమర్స్ ప్రమాద ఘటననే పేర్కొనవచ్చు. ప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రాంతంలోనే నాలుగు స్మార్ట్ పోల్స్ ఉన్నప్పటికీ వాటి నుంచి ముందస్తు సమాచారంగానీ, గాలిలో విషవాయువులు కలిసిపోయాయనిగానీ అనౌన్స్ చేయకపోవడం వాటి పనితీరుకు అద్దం పట్టింది.

మొక్కల నడుమ సరిగా కనిపించని ఫోల్స్

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి ఎదురుగా, సెంట్రల్ పార్క్ నైట్ ఫుడ్ కోర్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ పోల్ వద్ద మొక్కలు పెరిగిపోవడంతో అది కనిపించడం లేదు. ఇదే పరిస్థితి మరికొన్నిచోట్ల కూడా ఉంది. వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించకపోవడంతో తుప్పుపట్టేశాయి. వాటికి ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కూడా పనిచేయడం లేదు. కొన్ని కిందికి వేలాడుతున్నాయి. ఉన్నతాశయంతో ఏర్పాటుచేసిన స్మార్ట్ పోల్స్ ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో జివిఎంసి నవ్వుల పాలయ్యే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా వీటి నిర్వహణపై దృష్టిపెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్ హత్యలు !

సమగ్ర వికాసం ఈ కార్పొరేట్ విద్యాసంస్థల్లో కొరవడుతోంది. దీంతో విద్యార్థి లోకం ఒత్తిడితో కూడిన చదువులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పుస్తకాల బరువు, హోంవర్కులు, పరీక్షలు, మార్కులు, ర్యాంకులు వంటి వాటి హోరుతో తీవ్ర మానసిక వేదనకు విద్యార్థులు గురౌతున్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఇవి నిత్యకృత్యంగా మారినందున ఈ తరహా దుర్ఘటనలకు ఆస్కారమిస్తోంది. నగరంలోని సుమారు 20కి పైగా కార్పొరేట్ సంస్థల్లో ఆటపాటలు కరువై ఎప్పుడూ పుస్తకాలతో విద్యార్థులు కుస్తీ పడుతుండడం రివాజుగా మారిపోయింది. సమాజ తీరును సరైన రీతిలో అర్థం చేసుకునే సామర్థ్యం, అవగాహనా శక్తి రాకముందే విద్యార్థుల్లో విపరీత ఆలోచనలు పెరిగిపోయి డ్రగ్స్‌వైపు మరలడం, మద్యం సేవించడం, ఇలా బలవన్మరణాలను ఎంచుకోవడం కనిపిస్తోంది.

జ్యోతికి ఆర్థిక సాయం చేయాలి

ఎర్రాజీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో, ట్రాక్ పోటీల్లో గెలిచి ఎంతో గుర్తింపు పొందారన్నారు. 2023 ఆసియన్ గేమ్స్‌లో మెడల్ సాధించిన మహిళా అథ్లెట్ అని తెలిపారు. భవిష్యతులో సరైన శిక్షణ, ఆర్థిక సహాయం అందితే ఒలింపిక్ పోటీల్లో కూడా మెడల్ సాధించి భారతదేశానికి పేరు తీసుకురాగల క్రీడాకారిణి అని పేర్కొన్నారు. ఆమె తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత పరిధిలో జ్యోతి ఎర్రాజీ మంచి సౌకర్యాలు పొందడం సాధ్యం కాదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు.

అటకెక్కిన కూటమి హామీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి పార్టీల హామీలు అటకెక్కాయని, వైసిపికి మళ్ళీ పూర్వ వైభవం వస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. నూతనంగా నియమితులైన వైసిపి సౌత్ వికలాంగుల విభాగం అధ్యక్షులు గరికిన చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పద్మనాభం అమ్మాజీ వాసుపల్లిని ఆశీలుమెట్టలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వాసుపల్లి గణేష్ కుమార్ చొరవతో జిల్లా పెద్దలు, పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు.

స్మార్ట్ మీటర్లతో నష్టం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు నాలుగు వేల మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతారని, కనుక ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఉద్యోగాలు కోల్పోయే మీటర్ రీడర్లను ఇపిడిసిఎల్‌లోని ఇతర విభాగాలలో నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఘనంగా కస్టమ్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ కస్టమ్స్ డే వేడుకలు విశాఖ నగరంలోని పోర్ట్ స్టేడియంలో ఉన్న విశ్వనాథ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి విశాఖపట్నం కస్టమ్స్ విభాగం ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణానికి, శ్రేయస్సుకు కస్టమ్స్ పాత్ర కీలకమన్నారు. వికసిత్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో కస్టమ్స్ శాఖ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. ఎగుమతి, దిగుమతుల్లో ఆయా ఉత్పత్తుల స్వభావానికి తగ్గట్టుగా విభిన్న పద్ధతులను అవలంబిస్తూ 11 వేల ఉత్పత్తులను హ్యాండిల్ చేయడం సామాన్య విషయం కాదన్నారు. 205 దేశాలకు 7 వేలకుపైగా ఉత్పత్తులను మనం ఎగుమతి చేస్తున్నామన్నారు. 800 బిలియన్ డాలర్లకు సమానమైన ఎగుమతులు, 850 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతున్నాయన్నారు.. రాబోయే రోజుల్లో 100 మిలియన్ మెట్రిక్ టన్నుల ఎగుమతులే లక్ష్యంగా నిర్ణయించుకున్న పోర్ట్ అథారిటీకి కస్టమ్స్ సహకారం ఎంతైనా అవసరమన్నారు. విశాఖపట్నం జోన్ కస్టమ్స్ అండ్ సిజిఎస్‌టి చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ మాట్లాడుతూ ఆదాయ సేకరణ, వాణిజ్య సౌలభ్యం, దేశ ఆర్థిక సమగ్రతను పరిరక్షించడం ద్వారా దేశ నిర్మాణంలో విశాఖ కస్టమ్స్ గణనీయమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. 2023-2024లో విశాఖ కస్టమ్స్ జాతీయ ఖజానాకు రూ.15167.62 కోట్ల ఆదాయాన్ని అందించిందని, ఈ ఏడాది జనవరి 2025 వరకు కస్టమ్స్ రెవెన్యూ వసూళ్లు రూ.11,198.36 కోట్లుగా ఉన్నాయని తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా డిపార్ట్‌మెంట్ సిబ్బంది, అధికారులతో పాటు దిగుమతిదారులు, ఎగుమతిదారులు, కస్టమ్ హౌస్ ఏజెంట్లు, వివిధ సిఎస్ఎఫ్‌లు, పోర్టుల కస్టోడియన్లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, ఇతర భాగస్వాములకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విఎస్ఇజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కస్టమ్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు

సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకమని నేషనల్ ఫెడరేషన్ ఫర్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ (నాఫకబ్) చైర్మన్ లక్ష్మీ దాస్ పేర్కొన్నారు. 2025ను సహకార సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో కో - ఆపరేటివ్ సంస్థలు సహకార స్ఫూర్తి చాటేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజ అభివృద్ధిలో తమ వంతు భూమిక పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. 2025ను సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ది విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంకు 110వ ఏడాదిలోకి అడిగిడుతున్న తరుణాన్ని పురస్కరించుకొని సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రత్యేక కార్యక్రమం తలపెట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీదాస్ మాట్లాడుతూ సమాజంలో మెరుగైన విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన కోసం సహకార సంస్థలు తమ వంతుగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ శాసనసభ్యులు, వీసీబీ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు, చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో - ఆపరేటివ్ ఫెడరేషన్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, ఉపాధ్యక్షులు షేక్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.



విసిబి వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీదాస్, పలువురు ఎమ్మెల్యేలు

ఇసుక డిపోకు ఆదరణ కరువు!

ప్రజాశక్తి - ఆరిలోవ : కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కొత్తగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఉచిత ఇసుక డిపోకు ఆదరణ కరువవుతోంది. దీనికి కారణం నిర్మాణ పనులు జోరుగా సాగక పోవడమా? లేక ప్రయివేటు ఇసుక డిపోలను ఆశ్రయించడమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇసుక అందుబాటులో లేదని వినియోగదారులు గొగ్గోలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ అధీనంలో ఉచిత ఇసుక డిపోలు అందుబాటులోకి వచ్చినా వినియోగం తక్కువగా కనిపిస్తోంది. గత ఏడాది డిసెంబరు 6వ తేదీన ముడసర్లోవ వెనుక భాగంలోని జివిఎంసి ఖాళీ స్థలంలో ప్రభుత్వ ఉచిత ఇసుక డిపోను ఏర్పాటుచేశారు. అదే నెల 12వ తేదీన శ్రీకాకుళం జిల్లా గార ఇసుక రీచ్ నుంచి సుమారు 3,500 టన్నుల ఇసుకను ఇక్కడకు తీసుకొచ్చారు. టన్నుకు రూ.700లు లోడింగ్ ఛార్జీ తీసుకొని ఇసుకను సరఫరా చేస్తున్నారు. రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు కేవలం 700 టన్నులు మాత్రమే ఇసుక అమ్ముడు పోవడం గమనార్హం. కేవలం లోడింగ్ ఛార్జీలు తీసుకొని ఇసుకను ఉచితంగా అందిస్తున్నా కూడా ఇసుక వినియోగంలో జోరు అందుకోలేదు. చాలా మంది చిన్నచిన్న పనులకు ప్రయివేటు ఇసుక పాయింట్లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఇసుక డిపోల కంటే టన్నుకు రూ.50 తక్కువకు ప్రయివేటు వ్యక్తులు ఇస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. ఇసుక పరిమాణం తగ్గించి ఇస్తున్నారన్న సంగతి వినియోగదారులు గమనించలేక పోతున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక డిపోల్లో తీసుకున్న ఇసుకకు పక్కాగా బిల్లు అందజేస్తారు. ప్రయివేటు వ్యక్తుల వద్ద తీసుకున్న దానికి ఎటువంటి బిల్లూ ఉండదు. ప్రయివేటు వ్యక్తులు అమ్మే అనధికార ఇసుక పాయింట్లపై చర్యలు తీసుకుంటే వినియోగదారులు ప్రభుత్వ ఇసుక డిపోల వైపు మొగ్గు చూపిస్తారని నిర్వాహకులు అంటున్నారు.

ప్రభుత్వ డిపోల నుంచి ఇసుకను పొందడం ఇలా...

ప్రభుత్వ ఉచిత ఇసుక డిపో వద్ద నుంచి ఇసుకను పొందాలంటే ముందుగా వినియోగదారుడు ఆధార్ నెంబరు, ఇంటి పూర్తి అడ్రస్‌తో రిజిస్టర్ చేయించుకోవాలి. ఒక ఆధార్ కార్డుకు రోజుకు 20 టన్నులు ఇసుకను మాత్రమే తీసుకోవాలి. తీసుకొచ్చిన వాహనానికి జిపిఎస్ ఉండాలి. జిపిఎస్ లేకపోతే వాహనం డ్రైవర్ ఫోన్ నెంబరు తీసుకొని దానిని జిపిఎస్‌కు అనుసంధానం చేస్తారు. తీసుకున్న ఇసుకకు బిల్లు అందజేస్తారు.

మందగించిన నిర్మాణ పనులే కారణమా? ముడసర్లోవ డిపోలో తరగని నిల్వలు



ముడసర్లోవ డిపోలో నిల్వ ఉన్న ఇసుక



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆదర్శ ఫ్యామిలీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి ఆదర్శనగర్, సుందర్‌నగర్‌లో ఆదర్శ ఫ్యామిలీ క్లినిక్‌ను శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్టాభిరామ్, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలు ఉండే ఈ ప్రాంతంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలని క్లినిక్ నిర్వాహకులను కోరారు. క్లినిక్ డైరెక్టర్లు డాక్టర్ అఖిలేష్ మధు, డాక్టర్ హారికా చౌదరి మాట్లాడుతూ, ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలతో పాటు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ రుసుంతో స్థానికులకు వైద్య సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, మద్దిల రాజశేఖర్, రాజేష్, బుడుమూరు గోవిందు, బలగ సుధాకర్, ముగడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న గోవులు

ఆవుల అక్రమ తరలింపుపై కేసు

ప్రజాశక్తి - ఆరిలోవ : గోవులను అక్రమంగా అనధికార కబేళాలకు తరలిస్తున్న వారిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఐదు ఆవులను ఆరిలోవ బాలాజీనగర్‌లో ప్రధాన రహదారిలో కొంతమంది స్థానికులు అడ్డుకున్నారు. ఆరిలోవ ముస్తాఫా కాలనీలో అనధికారికంగా నిర్వహిస్తున్న పశు కబేళాకు తరలిస్తున్న సమయంలో కోడిబోయిన్ బాబ్జి యాదవ్ వెంబడించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వ్యాన్‌ను, అందులో ఉన్న ఐదు ఆవులను, వ్యాన్‌లో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న మహ్మద్ రఫీ, గణేష్‌లపై కేసు నమోదు చేసి ఆవులను దగ్గరలో ఉన్న గోశాలకు తరలించినట్టు సిఐ మల్లేశ్వరరావు తెలిపారు.



కెజిబివి విద్యార్థినులతో డాక్టర్ సుందరి

విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక గొల్లలపాలెం కెజిబివిలో చదువుతున్న 267 మంది విద్యార్థినులకు శనివారం అపూర్వ హాస్పిటల్‌కు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు మూర్తి, గైనకాలజిస్ట్ సుందరి దుప్పట్లు, రగ్గులు, పుస్తకాలు, పెన్నులతో పాటు గ్రంథాలయానికి పుస్తకాలు పంపిణీ చేశారు. వివిధ వంట సామాగ్రి కూడా అందజేశారు. ప్రిన్సిపల్ గంగా కుమారి కృతజ్ఞతలు తెలిపారు.

రొయ్యల హేచరీల్లో ఆకస్మిక తనిఖీలు



తిమ్మాపురంలో హేచరీలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లాలోని రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల లైసెన్స్ రెన్యువల్ నిమిత్తం చెన్నై, కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సిఎఎ) డైరెక్టర్ డాక్టర్ పి.శంకరరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, సిబ్బంది శనివారం మంగమారిపేట, తిమ్మాపురం గ్రామాల్లో ఉన్న పలు రొయ్యల హేచరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధ యూనిట్లలో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిన దృష్ట్యా, జిఒ 2 ప్రకారం టాస్క్ ఫోర్స్ కమిటీ కూడా సంబంధిత కేంద్రాలను పరిశీలించింది. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో వినియోగించే మేతలు, ప్రో బయోటిక్స్, ఇతర ఉత్పత్తులు సిఎఎ ద్వారా ధ్రువీకరించబడ్డవి మాత్రమే ఉపయోగించాలని సిఎఎ డైరెక్టర్ శంకరరావు సూచించారు. ఎంపెడ అధికారులు కూడా నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపెడ డీడీ ప్రసాద్‌నాయక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పిఎన్‌వి.ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్షేపణ లేని స్థలాల్లో ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టా

ప్రజాశక్తి -పద్మనాభం : 2019 అక్టోబర్ 15వ తేదీలోపు ఆక్షేపణలేని ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లకు కూటమి ప్రభుత్వం తెచ్చిన జిఒ 30 ప్రకారం 150 గజాల వరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు ఉచితంగా ఇస్తామని పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. 151 నుంచి 300 గజాల వరకు అక్కడ ఉన్న రేటుకు యాభై శాతం, 300 గజాలు దాటిన వారికి ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్కడ ఉన్న రేటు ప్రకారం పూర్తిగా చెల్లిస్తే రిజిస్ట్రేషన్ పట్టా మంజూరు చేస్తామని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ముత్తంశెట్టి

బ్రోచర్ విడుదల

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 'అపోథెకి 2 కె 25' పేరుతో ఈ నెల 25వ తేదీన జరుగనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, సాంకేతిక సదస్సు ముఖ్యోద్దేశం 'ఇన్‌స్పైర్ అండ్ ఇన్నోవేట్ ది గ్రీమింగ్ ఫ్యూచర్ ఆఫ్ ఫార్మసీ' అని వివరించారు. ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఇది వేదిక కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎంబివి.రాజు, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ వి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

విఆర్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మార్చి 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఏడవ చిన్న తరహా సాగునీటి సంఘాలు గుర్తింపుపై విఆర్‌ఒలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యాన ఎఎస్‌ఒ శేషాద్రి శిక్షణ ఇచ్చారు. భూగర్భ జల వనరులు, ఉపరితల నీటి పారుదల నమోదుతోపాటు నీటి సంఘాల గుర్తింపుపై శిక్షణ అందించారు.

బీచ్ రోడ్డులో బడ్డీల తొలగింపునకు యత్నం

అడ్డుకున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న పలు బడ్డీలను జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది భారీ క్రేన్ సాయంతో శనివారం తొలగించేందుకు చేసిన ప్రయత్నం కొంతమంది చిరు వ్యాపారుల ప్రతిఘటనతో బెడిసికొట్టింది. తొలుత పబ్లిక్ టాయిలెట్ వద్ద ఉన్న ఓ బడ్డీని క్రేన్ సహాయంతో తొలగించేందుకు ప్రయత్నించారు. ఇలా ఉన్న పళంగా తొలగించడం అన్యాయమని కొందరు చిరు వ్యాపారులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వివిధ వార్డుల సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీల ఆధ్వర్యాన బడ్డీల తొలగింపు జరుగుతుందన్న సమాచారంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, అదే పార్టీకి చెందిన కాసరపు నాగరాజు తదితరులు అక్కడకు చేరుకున్నారు. బడ్డీల తొలగింపును నిలిపివేయాలని కోరారు. కనీసం వార్డు కార్పొరేటర్‌తో కూడా సంప్రదించకుండా ఏకపక్షంగా తొలగించే అధికారం ఎవరిచ్చారని అక్కడే ఉన్న టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను నూకరాజు ప్రశ్నించారు. పార్కింగ్ పేరుతోనో, పబ్లిక్ టాయిలెట్లకు అడ్డంగా ఉన్నాయన్న పేరుతోనో ఏకపక్షంగా బడ్డీలను తొలగించి వారి పొట్ట గొట్టడం న్యాయం కాదన్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి పావురాల పార్కు వరకు కేవలం 500 మీటర్ల మేరకు మాత్రమే ఉపాధి కోసం ఎంతోకాలంగా చిన్న పాటి బడ్డీలు, తోపుడు బండ్లు పెట్టుకుని బీచ్‌కు వచ్చే సందర్శకులకు, పర్యాటకులకు వాటర్ బాటి ళ్లు, తినుబండారాలు అమ్ముతూ వచ్చే అరకొర ఆదాయంతో దాదాపు 300 కుటుంబాలు బతుకుతున్నాయని నూకరాజు వివరించారు. పర్యాటకరంగం అభివృద్ధిలో చిరు వ్యాపారులు కూడా భాగస్వాములేనని స్పష్టంచేశారు. ఒకరికి నష్టం కలిగించే సమయంలో తోటి చిరు వ్యాపారులు అండగా, ఐక్యంగా ఉండాలని చిరు వ్యాపారులకు నూకరాజు సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ యు.రామకృష్ణ ఆదేశాల మేరకు జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న 1, 2, 3 వార్డుల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు ఆర్.శిరీష, అనూష, శైలజ, రాజశేఖర్, అశ్విన్, ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి, ముగ్గురు చైన్ మెన్లు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో బడ్డీని భారీ క్రేన్ సాయంతో తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

గాజువాకలో ఇసుక వ్యాపారుల ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో ఉన్న ఇసుక వ్యాపారస్తులంతా శనివారం ఆందోళన చేశారు. కొన్ని రోజులుగా గాజువాక నియోజవర్గంలో ఇసుక వ్యాపారం చేస్తున్న వారంతా టన్ను రూ.750కే సరఫరా చేసేవారు. గాజువాకలో ఇసుక డిపో ఏర్పాటు చేసిన నుంచి డిపో దగ్గర టన్ను ఇసుక రూ.1,000కి విక్రయించడంతో ప్రజలందరూ ప్రైవేట్ ఇసుక వ్యాపారుల వైపు మొగ్గుచూపారు. దీంతో వ్యాపారస్తులందరి మీద గాజువాక తహశీల్దార్ అక్రమ కేసులు బనాయిస్తున్నారని వారంతా ఆందోళనకు దిగారు. శనివారం ఇసుక, ఇటుకను ప్రజలకు అమ్ముకుండా నిరసన తెలియజేశారు. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారం చేయకపోతే గాజువాకలో రాస్తారోకో చేస్తామని వర్తకులు హెచ్చరించారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వెంకన్న చౌదరి

21న చిన్మయ యువ తరంగ్

ప్రజాశక్తి -గాజువాక : చిన్మయ మిషన్ ఏర్పాటుచేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 21వ తేదీన గాజువాక సర్దార్ నెస్ట్‌లో చిన్మయ యువ తరంగ్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వై.వెంకన్నచౌదరి తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం గాజువాకలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలేజీలకు చెందిన 300 మంది విద్యార్థులు ఆ రోజు కార్యక్రమంలో దేశభక్తి, భగవద్గీత గీతాలు ఒకే స్వరంతో పాడనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తికి విశాఖ ఆర్‌డిఒ శ్రీలేఖ పంపిన నోటీసులు భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని దళిత, మహిళ, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల, జర్నలిస్టుల నేతలు పేర్కొన్నారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ, మీడియా ప్రతినిధులు ప్రజలకు వాస్తవాలను వెల్లడించే హక్కు ఉందన్నారు. విశాఖలో అనేక భూముల కుంభకోణాలు జరుగుతున్నాయని, నిత్యం పత్రికలు, ఛానల్స్ వాటిని వెలుగులోకి తెస్తున్నాయని గుర్తు చేశారు. ఆర్‌డిఒ శ్రీలేఖ పంపించిన నోటీసు ప్రకారం వాటిని వెలుగులోకి తేకూడదనేలా ఉందని విమర్శించారు. నోటీసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు ఎం.లక్ష్మి, కె.పద్మ, డెంకాడ ఆనంద్, వర్మ, ఇఎన్ఎస్ బాలు, వసంత రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి రవినగర్ భాష్యంలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు కరాటే, కోలాటం, రిబ్బన్ డాన్స్, వివిధ నృత్యాలు చేశారు. పరుగు పందెంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర్ మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు నేర్చుకోవడం వల్ల పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెడతాయన్నారు. క్రీడలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని చెప్పారు. క్రీడల్లో మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాఘవరావు, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ కంపర శ్రీను, పిఇటి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న భాష్యం ప్రతినిధి

రాజ్యాంగంతో హక్కుల రక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ ప్రజల హక్కులను రక్షించే పాత్రను భారత రాజ్యాంగం పోషిస్తోందని, అది ప్రజల జీవన విధానంలో భాగమని మాజీ ఐపిఎస్ అధికారి డాక్టర్ కె.రాజశేఖామణి పేర్కొన్నారు. నగరంలోని రామా టాకీస్ రోడ్డులోని అంబేద్కర్ భవన్‌లో శనివారం ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడిజెఎన్) ఆధ్వర్యాన 'భారత రాజ్యాంగం- ఆవశ్యకత - పరిరక్షణ' అంశంపై సదస్సును నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రాజశేఖామణి మాట్లాడుతూ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికపై దేశ ప్రజలకు గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఘనత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు దక్కిందన్నారు. కుల, మత, లింగ, ప్రాంతీయ సాంస్కృతిక అసమానతలను రాజ్యాంగం రూపుమాపిందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి మీడియా ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అంబేద్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట పల్లవి మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలో సామాజిక న్యాయం పిల్లర్ లాంటిదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన అది రాజ్యాంగ ఉల్లంఘన క్రిందకు రాదన్నారు. భారత రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం చట్టసభలు, కోర్టులతో సహా ఎవరికీ లేదని చెప్పారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రాజ్యాంగ మౌలిక సూత్రాలన్నీ రాజ్యాంగ ప్రవేశికలో ఉన్నాయన్నారు. ఐడిజెఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా కుల వివక్ష కలిగిన 14 దేశాల్లో కుల నిర్మూలన అవగాహనతో పనిచేయడానికి జర్నలిస్టులతో ఐడిజెఎన్ ఏర్పడిందని తెలిపారు. న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ బి.రమేష్‌బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర ఉద్యమంలో అంబేద్కర్ పాత్ర మహోన్నతమైనదన్నారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పరిశ్రమలు, సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెబితే దానికి వ్యతిరేకంగా నేడు ప్రైవేటీకరణ కొనసాగుతోందన్నారు. ఇది రిజర్వేషన్లను పరోక్షంగా తొలగించడమేనని అభిప్రాయపడ్డారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.లోదర్‌బాబు మాట్లాడుతూ అసమానతలు కలిగిన భారత దేశంలో అందరికీ సమాన అవకాశాలు, రిజర్వేషన్లు రాజ్యాంగం ద్వారా పొందామన్నారు. ఈ కార్యక్రమంలో మనభూమి దినపత్రిక ప్రచురించిన అంబేద్కర్ -పూలే కేలండర్‌ను ఆవిష్కరించారు. అతిథులకు అంబేద్కర్ చిత్రపటాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐడిజెఎన్ ప్రతినిధులు పి.సత్యనారాయణ, కె.చంద్రమోహన్, సైమన్, మధు, మురళి, వరద, శేషు, కోన ప్రకాష్, జాన్ వరబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సామాజిక అవగాహన అవసరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిస్టర్ సాండ్రినా

ప్రజాశక్తి -ములగాడ : యువత కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజంలో జరుగుతున్న విషయాలను కూడా అవగాహన చేసుకొని, సామాజిక చైతన్యం కలిగి ఉండాలని సెయింట్ ఆన్స్ సొసైటీ విశాఖపట్నం ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాండ్రినా పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన సీనియర్ విద్యార్థినుల విజయోత్సవ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వివిధ పోటీల్లో, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి, ప్రశంసించారు. గౌరవ అతిథి, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసెల్లా మాట్లాడుతూ, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి, మహిళా సాధికారతకు సెయింట్ ఆన్స్ విద్యార్థినులు ప్రతీకలుగా నిలవాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ, విద్యార్థినులు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని, దేశ సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, ఇతర ప్రోగ్రాం అధికారులు వి.అంజలీదేవి, నదియా, వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రత్యేక శిబిరాలలో, పలు సేవా కార్యక్రమాలలో ప్రతిభ చూపిన సీనియర్ విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదానం చేసిన సతీష్

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : వాసవీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యాన క్లబ్ గవర్నర్ తమ్మన అమర్‌నాథ్ ఆదేశాల మేరకు గాజువాక వాసవీ కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ రీజినల్ చైర్మన్ కొల్లూరు రమేష్ పర్యవేక్షణలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వాసవీ క్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులంతా స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 50వ సారి రక్తదానం చేసిన కేశరపు సతీష్, రామకృష్ణలను అభినందించి సత్కరించారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు కులుకూరి మంగరాజు, కేశరపు సతీష్ మాట్లాడుతూ, సామాజిక సేవకు వాసవీ క్లబ్‌లు ఎప్పుడూ ముందుంటాయని తెలిపారు. వేసవి కాలంలో రక్త నిల్వలు తక్కువగా ఉండడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అందక ఇబ్బందులు ఎదురవుతాయని, దానిని దృష్టిలో పెట్టుకొని ఈ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరా రమేష్, గుండా శరత్ చంద్ర గుప్తా, కటకం శైలజ, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్ బాలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో 118 యూనిట్ల రక్తం సేకరణ

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని సొంత్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఎపిఎస్.రాజా బ్లడ్ బ్యాంక్, వాసు ఇంటర్నేషనల్ బ్లడ్ బ్యాంక్ సమక్షంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, సిబ్బంది సుమారు 118 యూనిట్ల రక్తాన్ని దానం చేసినట్లు ప్రిన్సిపల్ శంభుప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ డాక్టర్ సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ పిఒ హరగోపాల్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : అర్హులైన పేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పెదగంట్యాడ మండలం గంగవరంలో శనివారం సిపిఐ ఆధ్వర్యాన అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంటి స్థలం లేక అనేక మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలని పాలక పార్టీలకు అనేక మార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, సోమేష్, మాధవరావు, పోలారావు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి అప్పలనర్సయ్య కాలనీలో నివాసముంటున్న ఆశ కార్యకర్త భారతి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. అనారోగ్యం కారణంగా రెండు రోజుల క్రితం కెజిహెచ్‌లో చేరారు. పరిస్థితి విషమించి మృతిచెందారు. అప్పలనర్సయ్య కాలనీ గంగిరెడ్డి కాలనీలో గత 20 సంవత్సరాలుగా ఆమె వైద్య సేవలందించారు. భారతి భౌతికకాయం వద్ద అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది నివాళులర్పించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎయు వీసీ

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ జె.శ్రీనివాసరావు సంయుక్తంగా రాసిన 'మాస్టరింగ్' ఫైనాన్సియల్ సర్వీసెస్ మార్కెటింగ్ పుస్తకాన్ని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు శనివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ఆచార్య నగ రాజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్, ముదునూరు డ్రీమ్స్ అకాడమీ, డాక్టర్ పల్లంసెట్టి సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సహకారంతో ఎయు ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'పై రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాప్-2025 శనివారం ముగిసింది. ఆర్ఎన్ఎన్, జిఎఎన్ఎన్, సిఎన్ఎన్, ఎంఎల్, డిఎల్ అల్గారిథమ్‌లు, మ్యాట్‌ల్యాబ్ అమలు వంటి అంశాలపై పరిశోధనాపత్రాలు సమర్పించారు. వర్క్‌షాప్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ, ప్రొఫెసర్ ఎస్.పల్లం సెట్టి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ కె.సౌమ్య, ముదునూరు డ్రీమ్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ ఎంఎస్.రాజు ముదునూరు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో సలహా మండలి సభ్యులు సతీష్, ఐ.శ్రీనివాసరావు విలువైన సలహాలను అందించారు.

అవకాశమివ్వండి.. మీ గళం వినిపిస్తా..


పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతు వినిపిస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం ఆమె అనకాపల్లిలోని చినబాబు కాలనీ, గుండాల వీధి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యా రంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పని చేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని, అటువంటి పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.



అనకాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరి



సినిమాకు క్లాప్ కొడుతున్న టిడిపి నేత సాయికృష్ణ

మంచి సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతాయి

ప్రజాశక్తి-మునగపాక : మంచి కథతో నిర్మించిన సినిమాలు ప్రేక్షకాదరణ పొంది విజయవంతమవుతాయని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. ఫైవ్ ఎలిమెంట్స్ క్రియేషన్స్, జిఎంఏఏ ప్రొడక్షన్ నెం-2 బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమాకు స్థానిక మునలితల్లి అమ్మవారి ఆలయంలో శనివారం పూజా కార్యక్రమం నిర్వహించి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ సినిమా ఒక శక్తివంతమైన మాధ్యమం అని పేర్కొన్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే దిశగా నిర్మించిన చిత్రాలు వారి హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. ఈ సినిమా విజయవంతం కావాలని, నటీ, నటులు, టెక్నీషియన్లు గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి కె.నవీన్ తేజస్ దర్శక, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. హీరో హీరోయిన్‌గా రాజేష్ బేజ్జాంకి, ఎం శ్రీజనా, ముఖ్య పాత్రలలో ఎం.చిన్న గణేష్, అఖిల్ నటిస్తున్నారు. కార్యక్రమంలో చిత్ర బృందం, సినీ ప్రముఖులు, స్థానిక నాయకులు పెంటకోట విజయ్, దాడి శివ, పెంటకోట శ్రీరామ్మూర్తి, అభిమానులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి నియోజకవర్గం, 94వ వార్డు పరిధి వేపగుంట గ్రామం సర్వే నెంబర్ 75లోని సుమారు 70 గజాల స్థలాన్ని ఆక్రమించి, అందులో అక్రమంగా భవనాన్ని నిర్మించి రూ.40 లక్షలకు అమ్మకానికి పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వేపగుంట గ్రామానికి చెందిన రాపర్తి రాజు కోరారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన ఈ మేరకు మీడియాతో మాట్లాడారు.

18న నల్లమారమ్మ మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : బిఆర్‌టి కాలనీ, రామాపురం, కృష్ణాపురంలో శ్రీనల్లమారమ్మవారి ఉత్సవాన్ని ఈనెల 18న ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఉత్సవ పోస్టర్లను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతకుముందు తుమ్మపాల శ్రీగంగాలమ్మ అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ ఎన్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కొరకు విద్యార్థి ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోతో https://apbragct.apcfss.in వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్‌లోగాని, జిల్లాలో దగ్గరలో ఉన్న ఏదైనా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలోగాని దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తును మార్చి 6వ తేదీ సాయంత్రం 4.30 గంటల లోగా అందించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

తల్లి జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మ నిస్తుందని, ఒక ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు. హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా నెల రోజుల నుండి రోడ్డు ప్రమాదాల కట్టడిపై ప్రజల్లో అవగాహన, ఉల్లంఘనలపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. జిల్లాలో సుమారు 94 కిలో మీటర్లు దాకా జాతీయ, 368 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులు ఉన్నాయని, ఇదే స్థాయిలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో 313 మంది చనిపోయారని, 734 మంది గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. ఇందులో 36 శాతం ద్విచక్ర వాహనాల రోడ్డు ప్రమాదాలు ఉన్నాయన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా రోడ్డు ప్రమాదాలకు గురై అర్ధాంతరంగా చనిపోవడం, క్షతగాత్రులు కావడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ షాపింగ్ మాల్, హెూండా కంపెనీ షోరూమ్ 30 హెల్మెట్లు, సాగర్ సిమెంట్ కంపెనీ సిఎస్ఆర్ నిధుల ద్వారా 75 స్టాపర్ బోర్డులను జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు.

ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో అనకాపల్లి పట్టణంలో హెల్మెట్ ర్యాలీ జరిగింది. సిఐలు, ఎస్సైలు, ఆర్టిఏ అధికారులు, సిబ్బంది హెల్మెట్లు ధరించి రింగ్ రోడ్డు జంక్షన్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ మీదుగా డీఎస్పీ ఆఫీస్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఆర్టీవో జి.మనోహర్, డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, ట్రైనీ డీఎస్పీ ఎంవికె.చైతన్య, ఇన్స్పెక్టర్లు ఎస్.లక్ష్మణమూర్తి, ఎం.వెంకట నారాయణ, టీవి.విజయ్ కుమార్, జి.అశోక్ కుమార్, ఏ.స్వామి నాయుడు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు



టెన్త్ విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డిఇఒ అప్పారావునాయుడు

ప్రజాశక్తి-సబ్బవరం

విద్యార్థులు ఇష్టపడి చదివితే తమ లక్ష్యాలను చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా, ఇంతవరకు రాసిన యూనిట్, సమ్మేటివ్ -1, 2 పరీక్షలు ఎలా రాశారో అలాగే ఈ పరీక్షలన్నీ రివిజన్ చేసుకొని రాయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని సూచించారు. హాస్టల్‌లో సౌకర్యాలు, మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సబ్జెక్టు పరంగా ఏదైనా సందేహం ఉంటే ఆ తరగతి ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మల్లు నాయుడుపాలెం హైస్కూల్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కూడా వారు ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు టీవీలు పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.సాంబమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు పాటు జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీలు శనివారం ముగిసాయి. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజులపాటు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, 100 మీటర్స్ రన్నింగ్ తదితర పోటీలు జరగ్గా, బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్‌లో చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రథమ స్థానం, ఉషోదయ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, వాలీబాల్‌లో విద్యార్థి డిగ్రీ కళాశాల మొదటి స్థానం, చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం, ఖోఖో పోటీలలో చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రథమ స్థానం, ఉషోదయ డిగ్రీ కళాశాల ద్వితీయ స్థానం సాధించాయి. పరుగు పందెంలో 100 మీటర్లలో ఎస్ గాయత్రి ప్రథమ స్థానం, జి మోహిని, ఆర్ మానస ద్వితీయ స్థానం, బాలురు రన్నింగ్‌లోబి శివ మొదటి స్థానం, జి.సాయి దుర్గ, ఈ.మనీష్‌లుద్వితీయ స్థానంలో గెలుపొందారు. ఈ ఆటల పోటీలను కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లిబాబు, జి.వెంకటేష్, అధ్యాపకులు సంతోష్, శ్రీనివాసరావు, తాతారావు, గణేష్ నిర్వహణలో సీనియర్ అద్యాపకుల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐవివి.సత్యవతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని కొత్తపెంట, దేవరాపల్లి గ్రామాల్లో స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మతో కలిసి ఆయన ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాదారు పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతుకి ఒక ఐడి నెంబర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ ఆధార్, పట్టా పాస్ పుస్తకం 1బి, ఆధార్‌కి లింకు అయినా ఫోను నెంబర్ గల ఫోను పట్టుకొని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఈ ఐడి నెంబర్ కలిగి ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పిఎమ్ కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ రాయితీలు, పంట బీమా, పంట నమోదు ప్రక్రియ, బ్యాంకుల్లో లోన్లు, పంట నష్టాలు, యంత్ర సేవా పరికరాలు, పైపులు వంటి సేవలు అందుతాయని చెప్పారు. ఈ నెల 25వ లోపు రైతులందరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు

ప్రజాశక్తి-సబ్బవరం : రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని స్థానిక సిఐ పిన్నింటి రమణ అన్నారు. మండల కేంద్రంలోని దుర్గమాంబ ఆలయం ఆవరణలో శనివారం తాసుపల్లి ఫౌండేషన్ చైర్మన్ శంకర్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీబంగారమ్మ తల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్నవారికి ప్రాణాలను దానం చేయడమే అవుతుందని చెప్పారు. రోటరీ క్లబ్, లైవ్ షేర్ బ్లడ్ బ్లడ్ బ్లాంక్‌లు సౌజన్యంతో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 150 మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు. 100 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. అనంతరం శ్రీ బంగారు తల్లి సేవా సమితి సభ్యులు కేక్ కట్ చేసి శంకర్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారు తల్లి సేవాసమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకట్రావు, సభ్యులు, యువతీ, యువకులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎపి గవర్నర్ కార్యదర్శిగా రఘు నియామకంపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కార్యదర్శిగా అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాల పూర్వ విద్యార్థి కోన రఘు నియామకం పట్ల శనివారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో ఇంటర్ హెచ్ఇసి గ్రూపులో 1989-91, ఇదే కళాశాలలో బిఎ 1991 నుంచి 94 వరకు చదువుకున్నారు. రఘు నియామకం పట్ల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు, కళాశాల పాలకవర్గం హర్షం వ్యక్తం చేసింది.

18న హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి : రామనగర్ టిడ్కో కాలనీలో ఈ 18 తేదీన హనుమాన్ ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు బొడ్డేటి ప్రసాద్, హైరామ్, ఆషారాణి శనివారం తెలిపారు. టిడ్కో కాలనీలో హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది కానున్న సందర్భంగా భారీ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు. సోమవారం వినాయకుడు, షిరిడి సాయి విగ్రహాలు ప్రతిష్ట చేయడానికి కూడా కమిటీ సభ్యులు నిర్ణయించారని వివరించారు. మంగళవారం తర్ధ మహెూత్సవం కూడా నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు.

17న అంగన్వాడీల ధర్నాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 17న జరిగే ప్రాజెక్టుల వద్ద ధర్నాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అంగన్వాడీలపై ప్రభుత్వం పని భారం పెంచుతుందని తప్ప, పనిని గుర్తించి వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంటర్ నిర్వహణకు ఇచ్చే మెనూ చార్జీలు సరిపోక సొంత డబ్బులతో కూరగాయలు కొని వండే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. 2019 నుంచి వేతనాలు పెరగలేదన్నారు. వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై 42 రోజులు పాటు సమ్మె చేయగా, 2024 జూలైలో వేతనాలు పెంచడంతోపాటు, ఇతర సమస్యల పరిష్కారం చేస్తామని మినిట్స్ కాపీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా నేటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. వీటి కోసం ఈ నెల 17న ధర్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్‌కు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, సాధికారిక సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని, అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమామణి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేటట్లు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి కె రమామణి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె పలు శాఖల అధికారులు, పంచాయతీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులపై దృష్టి సారించి వేగవంతం చేయాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో పాలుపంచుకున్న అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి.పద్మజ, ఈఓపిఆర్డి చైతన్య, తహశీల్దారు బి.చిన్నకృష్ణ, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఉపాధి హామీ నిధులతో అవసరమయ్యే వారికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం జరుగుతుందని డ్వామా పిడి ఆర్.పూర్ణిమ దేవి తెలిపారు. మండలంలోని కే సంతపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఇంకుడు గుంతలు నాణ్యంగా తయారు చేయాలని సూచించారు. ఇంటిలో వాడుక నీరు ఇంటి పరిసరాలలో నిలువ ఉండకుండా ఉండటానికి, భూగర్భ జలాలు పెరగడానికి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఒక్కో గుంతకు 6,500 రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సాంబశివరావు డ్వామా ఏపీఓ బి శ్రీనివాసరావు, ఈఓపీఆర్డి రమణి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపిఒ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సీతారాముల తీర్థం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఎల్లుప్పి పంచాయతీ శివారు మర్రిపాలెం గ్రామంలో శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం 6 గంటల నుండి సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సాము గరిడీలు, చిటికెల భజనలు, మహిళా కోలాటాలు, మందుగుండు సామగ్రి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అమరపిన్ని నరసింగరావు, తుంపాల కోటేశ్వరరావు, తుంపాల శివ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారమెట్టలో శ్రీగౌతమ బుద్ధుని తీర్థ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తీర్థ మహోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు, కుండల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-వడ్డాది : క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వడ్డాది జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శేషుబాబు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్, కెజిబివి, విజయరామరాజుపేట హైస్కూల్ తదితర పాఠశాలలో సాక్షి దినపత్రిక సహాయంతో 10వ తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శేషుబాబు మాట్లాడుతూ మార్చి 17 నుండి జరగనున్న 10వ తరగతి పరీక్షలు విద్యార్థులు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టివి శేషగిరిరావు, ఆర్.వెంకట్రావు, సిఆర్పి కుమార్, టి.శ్రీను, బి.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



టెన్త్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం



దీక్షల్లో కూర్చున్న సిఐటియు నాయకులు, ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి- ఉక్కునగరం : రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడమే కాకుండా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని సిఐటియు నాయకులు కె.జగ్గారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1465వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి క్రమేపీ పెరుగుతున్నా కార్మికులకు మాత్రం సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. తాజా పరిణామాలను గమనిస్తే ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికే మోడీ సర్కారు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోందన్నారు. ఉక్కు నిర్వాసితులకు ప్లాంట్‌లో ఉద్యోగాల కల్పన అంశాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. కర్మాగారానికి సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపితే మరింత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు రానున్న కాలంలో పోరాటాలు మరింత ఉధృతం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, మురళి, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, బి.సత్యనారాయణ, పి.రామారావు, ఎర్రయ్య, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గవరపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళల కోలాట పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు రొంగలి మహేష్, బత్తి రమణ, చల్లా సత్యనారాయణమూర్తి, అక్కునాయుడు, పూడి నారాయణమూర్తి, తనకల పట్టాలు, దాట్ల శ్రీనురాజు, కుంచా అంజిబాబు, శరగడం అచ్చంనాయుడు, శరగడం అప్పారావు, మల్ల వెంకటరావు, పెంటకోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ సీతారామాలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ట

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారామాలయంలో శనివారం ఉదయం ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నమనాయుడు, ఎంపిటిసి రాపేటి అరుణ రాము, దంపతులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, పెందుర్తి నియోజకవర్గం వైసీపీ నాయకులు గండి రవికుమార్, యువ నాయకులు గండి వంశీ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి రామునాయుడు, బోను నాయుడు, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, మల్ల బాలాజీ, ఎడ్ల నాయుడు, చీరికి దేముడు, మాజీ ఎంపిటిసి బీసెట్టి వెంకట్రావు, దొడ్డి రాజు కోటి, దాడి సూరిబాబు, దొడ్డి శ్రీను, దొడ్డి రాము, సిలపరశెట్టి మూలినాయుడు, సత్యనారాయణ, ఆడారి వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పింక్ సఖీ శారీ వాక్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా వ్యాపిస్తున్న కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈ నెల 16న ఉదయం విశాఖపట్నం బీచ్ రోడ్‌లో తలపెట్టిన పింక్ సఖీ శారీ వాక్‌ను జయప్రదం చేయాలని ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తాడిమళ్ళ కోరారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా వారి సహకారంతో ఈ పింక్ సఖి శారీ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలకు కేన్సర్లపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. వాక్‌ను బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుండి వుడా పార్కు వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఆరోగ్య శాఖ, సిఎంఆర్ గ్రూప్,



మాట్లాడుతున్న సినీ నటి గౌతమి

హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, ప్రముఖ ఆంకాలజిస్టులు, అనేక కార్పొరేట్ సంస్థలు, సామాజిక సంస్థలు మద్దతును అందిస్తున్నాయని తెలిపారు. నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి మాట్లాడుతూ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనంతరామ్ గణపతి మాట్లాడుతూ తమ ట్రస్ట్ 16 ఏళ్ల క్రితం స్థాపితమై వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. మీడియా సమావేశంలో శ్రావణ్ షిప్పింగ్ ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, గురుద్వార సత్ సంగత్ అధ్యక్షులు డాక్టర్ డిఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కాడి కాసు

ప్రజాశక్తి-చోడవరం : వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీపీ గాడి కాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవిలో మంచినీటి కొరత ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా చోడవరం పట్టణంలో ఎప్పటికప్పుడు నీరు సరఫరా అయ్యే విధంగా పంచాయతీ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండలంలో చేతిపంపులు మరమ్మతుల గురికాకుండా, పంపు హౌస్‌ల ద్వారా సరఫరా అయ్యే నీటికి ఆటంకం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులపట్ల సిబ్బంది అనుచితంగా వ్యవహరిస్తున్నారని, కనీస మర్యాద లేకుండా చూస్తున్నారని, ఆసుపత్రిలో మందులు కొరత కారణంగా ప్రైవేటు షాపుల వద్దకు వెళ్లి మందులు కొనుక్కోవాల్సి వస్తుందని రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని దీనిపై విద్యుత్ అధికారులు శ్రద్ధ వహించాలని సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏ.రామారావు, ఎంపీడీవో ఆంజనేయులు, పిఓపిఆర్డి మహేష్, అధికారులు, పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

-పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు



అనకాపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి:మనం నివసిస్తున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టరు పాల్గొన్నారు. ప్రతి ఇంటినుండి చెత్తను తడి, పొడిగా విడదీసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని జిల్లా కలెక్టరు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి రోడ్డుపై చెత్తకుప్పలు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజులలో గ్రామంలో మొత్తం చెత్తకుప్పలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు గ్రామంలో పర్యటించి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ షేక్ ఆయిషా, ఎస్‌డిసి మండల ప్రత్యేకాధికారి సుబ్బలక్ష్మి, డిపిఒ ఆర్.శిరీషారాణి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజుకుమార్, ఎంపిడిఒ కెవి.నర్సింహారావు, గ్రామ వార్డు సచివాలయాధికారి ఇ.నాగలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఆవరణలో డిఆర్‌ఒ వై.సత్యనారాయణరావు, ఇతర సిబ్బంది కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ ఆధ్వర్యాన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేశారు. డీఎస్పీ బి.అప్పారావు, ఏఒ రామ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, ఎస్సైలు సురేష్ బాబు, వెంకన్న, కామేశ్వరరావు పాల్గొన్నారు. శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగ ణంలో ఆలయ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పూడి పంచాయతీ పరిధిలో బంగారుమెట్ట, ఎల్.సింగవరం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బంగారుమెట్ట ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పూడి పంచాయతీ కార్యదర్శి రామ్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి సతీష్, మనోజ్, ప్రభావతి, అంగన్వాడి సిబ్బంది జ్యోతి, హెచ్‌ఎం రాజు పాల్గొన్నారు

చోడవరం : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా చోడవరం పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు అవగాహన కలిగించారు. స్వచ్ఛ దివస్ స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఈఓపిఆర్డి మహేష్, ఈవో నారాయణరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సిహెచ్‌సి చుట్టుపక్కల ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కోటేశ్వరరావు, రెడ్డి రమ, వైదేహి, సునీల్, నందకిషోర్, కుశమరాణి, ప్రశాంత్, సురేంద్రబాబు, సుమన్ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి గాంధీనగరంలో చెత్తపై జరిగిన అవగాహన శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బిజెఎస్‌పి.రాజు, టిపిఒ శ్రీలక్ష్మి, ఏఈ నానాజీ, శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, త్రినాధరావు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు. మండలంలోని ఏటికొప్పాకతో పాటు అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ కెఎస్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : ఎంపీడీవో పి.పద్మజ సబ్బవరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, ఆ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక పీహెచ్సీ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, సబ్బవరం సర్పంచ్ డి.ప్రసాదరావు, కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

నక్కపల్లి:ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. రాజయ్యపేట సముద్రతీర ప్రాంతంలో సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్‌లతో కలిసి తీర ప్రాంతంలో చెత్తను తొలగించారు. మండల పరిషత్ కార్యాలయం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఇంచార్జ్ ఈ ఓ పిఆర్‌డి ఎం.శ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో డి.సీతారామరాజు ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర పై వెలుగు వివిఏ, ఉపాధి, వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. హోం కంపోస్టు, కిచెన్ గార్డెన్ లబ్ధిదారుల గుర్తించి యాప్ లో అప్డేట్ చేయాలని సూచించారు. ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ నాగభూషణం, ఉపాధి ఏపీఓ భాగ్యలత పాల్గొన్నారు.

మాడుగుల :మండలంలోని శనివారం పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనట్లు ప్రత్యేక అధికారి ఎర్రినాయుడు తెలిపారు. ముందుగా పరిసరాల పరిశుభ్రత పై ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో శుభ్రత, మొక్కలు నాటడం, ప్రత్యేక పారిశుధ్యం, పరిసరాలు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ జి జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ ఎం రాంకుమార్, రాజు, షర్మిలశ్రీ, నారాయణ, అప్పల నాయుడు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మేజర్ పంచాయితీ దార్లపూడి గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు యంపిడివో సత్యనారాయణ తెలిపారు. పరిశుభ్రతపై ర్యాలీలు, ప్రతిజ్ఞ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె మనోరమ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, ఆరోగ్యకర, ఆహ్లాదకర వాతావరణంలో పని చేద్దామని స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ పరిసరాలను ఆయన ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ఆవశ్యకతను తెలుపుతూ పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కెజిహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ ద్వారకా బస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యన్నారాయణ మాట్లాడారు. మహారాణిపేట లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం వద్ద సిబ్బంది శుభ్రతా చర్యలు చేపట్టారు.



ఇపిడిసిఎల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఎంవిపి.కాలనీ : వియంఆర్‌డిఏ ఉద్యోగ భవన్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి టి.మురళీకృష్ణ, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప పాల్గొన్నారు. ఎంవిపి రైతు బజార్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకులు కనకరాజు పాల్గొన్నారు. ఎండాడ ప్రాంతంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాల విభజన, సేంద్రీయ ఎరువు తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జివిఎంసి అదనపు కమిషనర్లు ఆర్.సోమన్నారాయణ డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్ పాల్గొన్నారు.



నక్కపల్లిలో శుభ్రం చేస్తున్న అధికారులు

పద్మనాభం: పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ, మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ జయ విజయ పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల పరిసర ప్రాంతాలను వైద్యులు, సిబ్బంది శుభ్రపరిచారు ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య శాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, ప్రొఫెసర్లు డాక్టర్ రమణ, డాక్టర్ ప్రేమలత పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన కళాశాల ఆవరణ, బస్ స్టాప్ పరిసరాలలో ప్లాస్టిక్, చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో 60 మంది వాలంటీర్లు పాల్గొన్నారు

మండలంలోని బంటుపల్లి గ్రామ పంచాయతీలో కార్యదర్శి షేక్ షమ్ము ఆధ్వర్యాన రోడ్లను శుభ్రపరిచారు. పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం ఎల్‌వి.పాలెంలో స్వచ్ఛ ఆంధ్రను పురస్కరించుకొని 'సోర్స్ టు రిసోర్స్' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ శ్రీనివాసరావు, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు

ఆరిలోవ : విమ్స్ ఆసుపత్రిలో పరిసరాలను వైద్యులు, సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం విమ్స్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, సిహెచ్‌ఒ సౌభాగ్యమణి, పిహెచ్‌ఎన్ సత్యవతి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసరాలను సిబ్బంది, విద్యార్థులు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డి.ప్రవీణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అప్పలనాయుడు, శ్రీను పాల్గొన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ పరిశ్రమ ఆవరణలో సమీప గ్రామాల ప్రజలు, సంస్థ ఉద్యోగులు శుభ్రం చేశారు. సంస్థ డైరెక్టర్ ఎస్ దేవేందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ ఎల్వీ రమణ పాల్గొన్నారు.

ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో పరిసరాలను జైలు అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం జైలు అధికారులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి మహేష్ బాబు, ఉప పర్యవేక్షణాధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పోరేట్ కార్యాలయంలో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉద్యోగులచే సిఎమ్‌డి పృథ్వీతేజ్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వి విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సిజిఎమ్‌లు డి.సుమన్‌కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్ పాల్గొన్నారు.



సమస్యను పరిష్కరిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:భూ వివాదాలు పరిష్కారమే లక్ష్యంగా మండల కోఆర్డినేషన్ కమిటీ చర్యలు చేపడుతుందని తహసిల్దారు తిరుమల బాబు అన్నారు, శనివారం తహసిల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో కాశీ విశ్వనాధ రావు, స్థానిక ఎస్సై రమేష్ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఫిర్యాదు దారులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా శనివారం పీకే పల్లి, రెవెన్యూ గ్రామం రామన్నపాలెం అన్నా చెల్లెళ్ల మధ్య భూ సమస్యను పరిష్కరించారు.ఎండపల్లి గ్రామంలో కుటుంబ సభ్యుల సమస్యను కమిటీ దృష్టికి తీసుకు రావడంతో పూర్తి స్థాయిలో వారికి అవగాహన కల్పించారు.వివాదాలకు తావు లేకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పిర్యాదులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తిరుమల బాబు మాట్లాడుతూ, ఇంత వరకు మండలంలో వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది సమస్యలను మండల కోఆర్డినేషన్ కమిటీ పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్టు

నైపుణ్యత పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:విద్యార్థులు సాంకేతిక నైపుణ్యత పెంపొందించుకోవాలని సైకాలజిస్ట్ టి శ్రీహరి సూచించారు. శనివారం మాకవరపాలెం మండలంలో కొండల అగ్రహారం గ్రామంలో గాయత్రి విద్యా మందిర్ పాఠశాలలో కరెస్పాండెంట్ అమీన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనే అత్యధిక నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారని తెలిపారు. నైపుణ్యత అనేది 40 శాతం ఎడ్యుకేషన్ ద్వారా 60శాతం తల్లిదండ్రుల ప్రోత్సాహం ద్వారా వస్తుందన్నారు. విద్యార్థులు ఎప్పుడు బలహీనతల పట్ల కాకుండా బలాలపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. విజయం సాధించేదెలా అనే విషయంపై వివిధ కథనాలను ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలిరెడ్డి వెంకటరమణ, ఏపీజీ విబి బ్యాంక్ మేనేజర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తరలి వచ్చిన భక్తులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి వీవర్స్ కాలనీలో శనివారం గణపతి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో వీరాంజనేయ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్టించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

కీచక పిఇటిపై డిఇఒ విచారణ

- తొలగించాలని ఆదేశం - హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో చోద్యం హైస్కూల్‌లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కుందురు నూకరాజు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా విద్యాశాకాధికారి జి.అప్పారావునాయుడు విచారణ నిర్వహించారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి రావడంతో ఎంఇఒ సత్యనారాయణ విచారణ నిర్వహించారు. ఆయన నివేదిక ఆధారంగా శనివారం డిఈఓ విచారణలో భాగంగా వ్యాయామ ఉపాధ్యాయుడిని ప్రవర్తనపై సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులను విచారించారు. తమను ఆటల పోటీలకు తీసుకు వెళ్లిన పీఈటీ అసభ్యంగా ప్రవర్తించారని విచారణలో విద్యార్థినీలు తెలిపారు. ఈ సంఘటన వాస్తవం అని తేలడంతో ప్రధానోపాధ్యాయుడుకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, కాంట్రాక్టు పీఈటీని తొలగించినట్లు డీఈఓ విలేకర్లకు తెలిపారు. ఈ విచారణలో ఎంఈఓలు సత్యనారాయణ, మూర్తిలు పాల్గొన్నారు.

అనంతరం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో కేడీపేట ఎస్సై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థినీలను, తల్లిదండ్రులను విచారణ చేశారు.

గొలుగొండ:మండలంలో డీఈఓ అప్పారావు నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఏ.ఎల్.పురంలో సమావేశమ య్యారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. ఈ సందర్భంగా సమస్యలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డిఇఒ అప్పారావునాయుడు

భూ ఆక్రమణపై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి -రావికమతం:ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిని లే అవుట్ గా మార్చడంతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై క్రిమినల్ కేసులకు సిఫారసు చేశామని తహసిల్దార్ బి.వెంకటరమణ శనివారం తెలిపారు. గుడ్డిప రెవెన్యూ పరిధి సర్వే నంబరు 44,45లో అగనంపూడి కి చెందిన భూ స్వామి 14 ఎకరాల జరాయితి భూమిని కొనుగోలు చేశారన్నారు. ఈ భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్ గా మార్చారని తమ విచారణలో తేలిందన్నారు.గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివాదాస్పద భూమిని పరిశీలించగా అక్రమ లేఔట్ తో పాటు అక్కడే ఉన్న జరాయితీ భూమి పక్కనే ఉన్న సుమారు 5 ఎకరాల గయ్యాలు (ప్రభుత్వ భూమి) ఆక్రమించుకున్నట్టు సర్వేలో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేయాలని రావికమతం ఎస్ఐ కు సిఫారసు చేసామని తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

వ్యాక్సినేషన్‌పై ఆరా

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ ఎంపీడీవో డి.సీతారామరాజు పరిశీలించారు. వ్యాక్సినేషన్ వేసేటప్పుడు చిన్నారులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎంతమంది పిల్లలకు వ్యాక్సినేషన్ వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపిఆర్డి ఎం శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి

బాలికలు మనోధైర్యంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నర్సీపట్నం డీఎస్పీ పీ.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, బాలికలు ఎప్పుడు మనోధైర్యం కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి-డంబ్రిగుడ:మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో సాగు భూములు ఇచ్చిన భూ బాధిత గిరిజనులు చేపట్టిన రిలే దీక్ష శనివారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు డొంబు, రాంచందర్ మాట్లాడుతూ, ఉపాధి కల్పిస్తా మని అధికారులు హామినిచ్చి ఇప్పటికి ఏడేళ్లు కావస్తున్నా విస్మరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అనంతగిరి మండలం కోనాపురం పంచాయితి కరాయిగూడ గ్రామంలో శనివారం పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు కోనాపురం పంచాయితి సర్పంచ్ గుబాయి అప్పలమ్మ ఆధ్వర్యంలో పివిటీజి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మారుమూల పివిటిజి గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీరు, తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎస్టీ కమిషన్ మెంబర్ రామలక్ష్మి, నాయకులు కిల్లో ప్రసాద్, గుబాయి జగన్నాథం, వార్డ్ మెంబర్ గుబాయి వెంకటరావు పాల్గొన్నారు.

డి పట్టా భూములకు పరిహారం చెల్లించాలి



సమస్యలు తెలుసుకుంటున్న వైసిపి నేత వీసం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వైజాగ్- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం కాగిత జాతీయ రహదారి నుండి రోడ్డు నిర్మాణంకు చేపట్టిన భూసేకరణలో జిరాయితీ భూములతో సమానంగా డీ పట్టా భూములకు కూడా పరిహారం చెల్లించాలని వైసీపీ నేత వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన డి పట్టాదారులతో సమావేశ మయ్యారు.ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ, గత 35 సంవత్సరాలు క్రితం ప్రభుత్వం తమకు డి పట్టా భూములు ఇచ్చిందని, అప్పటి నుండి ఆ భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఈ మేరకు వీసం రామకృష్ణ మాట్లాడుతూ, భూములు కోల్పోయిన దళితులకు అండగా ఉంటామన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి, జిరాయితీ భూములు ఇచ్చిన విధంగా రూ.60 లక్షలు డి పట్టా భూములకు కూడా పరిహారం చెల్లించాలని కోరుతూ అర్జీ అందజేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, గ్రామస్తులు పోతంశెట్టి బాబ్జి, దేవవరపు శివ, దళితులు పాల్గొన్నారు.

చెట్లకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట లో ఏపీఐఐసీ సేకరించిన డి పట్టా సాగు భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించాలని పంచాయతీ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ డిమాండ్ చేశారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపట్టిన భూ సేకరణలో జురాయితి భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించారని, డి పట్టా సాగు భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించలేదన్నారు. డి పట్టా, సాగు భూముల్లో గల చెట్లకు పరిహారం చెల్లించాలని కోరుతూ జనవరి 27న జిల్లా కలెక్టర్ కు అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై గ్రామ వి ఆర్ ఓ తమను సంప్రదించకుండా, అర్జీని పరిష్కరించడం జరిగిందని తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు.తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన వి ఆర్ ఓ పై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంది కొండమ్మ,చోడిపల్లి కొండమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు



మాట్లాడుతున్న ఎంఇఒ

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈఓ కే.నరేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని నక్కపల్లి, వేంపాడు చినదొడ్డిగల్లు, గొడిచర్ల హైస్కూల్‌లలో ప్రాథమిక/ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు శనివారం ఎంఈఓ నరేష్ ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించారు.ఈ సందర్భంగా చినదొడ్డిగల్లు హైస్కూల్ లో కాంప్లెక్స్ చైర్మన్ బి.కవిత, పరిశీలకులు డి సత్యారావులు తరగతులను పరిశీలించారు. ముఖ్యంగా పదవతరగతి లో వెనుకబడిన విద్యార్థుల పై దష్టిసారించి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఈ శిక్షణ తరగతులలో చర్చించాలన్నారు. ప్రతీరోజూ పాఠశాలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని, డ్రాప్ అవుట్ లు లేకుండా చూడాలన్నారు. విద్యాశాఖ రూపొందించిన సెషన్స్ ప్రకారం ఉపాధ్యాయులందరూ చర్చించాలన్నారు.ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల కు గణితంలో చతుర్విధప్రక్రియలతోపాటు ,భాషలలో చదవడం రాయడంపై ఉపాధ్యాయులు దష్టి సారించాలని, ప్రతీ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ లు ఎన్.వి.ఎస్.ఆచార్యులు సుజనరంజని, వై.వి.రమణ, శేఖర్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.